క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జితేందర్

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త జితేందర్ కేడియా రూ.3లక్షల విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్మాణానికి తన వంతు విరాళం అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేష్‌గుప్త, అన్మారి వెంకటయ్య, గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకంలో మెలకువలు తప్పనిసరి



నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొందుర్గు: మొక్కల పెంపకంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వనన ర్సరీని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మొక్కల పెంపకం కోసం చేపడుతున్న కవర్ ప్యాకింగ్‌లో మట్టి, ఇసుక, ఎరువులను సరైన పాళ్లలో నింపాలన్నారు. కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ఆరంభంలోనే మొక్కలను నాటే విధంగా నర్సరీలో మొక్కలు ఏపుగా పెరిగేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

స్వామివారికి దీపకాంతి స్టాండ్ కానుక



దీపం స్టాండ్‌ను అందజేస్తున్న దంపతులు

చేవెళ్ల: శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోని స్వామివారి పూజకు వెండి దీపకాంతి స్టాండ్‌ను దాత టేకులపల్లి శ్రీనివాస్, శివరంజని దంపతులు అందజేశారు. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ధర్మకర్తలు, పూజారులు శ్రీకాంత్, శ్రీపాదు, మేనేజర్ శ్రీనివాసులకు దీపస్టాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చేవెళ్ల వేంకటేశ్వరస్వామికి ఎంతో మంది భక్తులు దాతలు ఉన్నారని చెప్పారు. ఆలయ అభివృద్ధికి స్వామికి దాతలు ముందుకు వచ్చిన తమ వంతు కానుకలు అందించడం సంతోషకరమని చెప్పారు. రూ.2లక్షల18వేల విలువ గల దీపకాంతి స్టాండ్‌ను వెండితో చేయించి ఇచ్చారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సమాజ సేవలోనే సంతృప్తి

బీజేపీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మహేందర్‌రెడ్డి

కొత్తూరు: సమాజసేవలోనే ఎంతో సంతృప్తి ఉంటుందని కొత్తూరు బీజేపీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామంలో ఆయన సోమవారం పార్టీ నాయకులతో కలిసి పలువురికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ తరఫున తనవంతుగా పలు సేవా, సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉండడంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు, అనాథలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మామిడి భీంరెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, మాణిక్యం, యాదయ్య, శివ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు నొక్కే ప్రయత్నం

చేవెళ్ల: అరెస్టులు చేసి ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తోందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్నారు. మండలంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన నాయకులను సొంత పూచికత్తులపై వదిలేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ సర్పంచుల నిధులను దారి మళ్లిస్తున్నా ప్రభుత్వాన్ని గద్దె దించాలని డిమాండ్ చేశారు. పంచాయతీల నిధులు దారిమళ్లింపుకు నిరసనగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నాకు పిలుపు నిచ్చినట్లు తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనం.. పోటెత్తిన భక్తజనం



చేవెళ్ల: లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



మొయినాబాద్‌రూరల్‌లో..



కొందుర్గు: పల్లకీపై ఊరేగుతున్న స్వామివారు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లోని దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉత్తరద్వారం ద్వారా భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. భక్తుల కోసం ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



చేవెళ్ల: లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో క్యూలో ఉన్న భక్తులు



కేశంపేట: ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు



చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు



షాబాద్: సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి దంపతులు

అభివృద్ధికి దాతల సహకారం అవసరం

సర్పంచ్ అనిత



మురుగు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, దాత

శంకర్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల పంచాయతీల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందించాలని పర్వేద సర్పంచ్ అనితసురేందర్‌గౌడ్ అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని పర్వేద గ్రామంలో దాత జైపాల్‌రెడ్డి తన సొంత నిధులు రూ.45లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాలువల నిర్మాణం పనులను సోమవారం సర్పంచ్ అనిత , ఎంపీటీసీ వెంకట్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి దాత జైపాల్ రెడ్డి ముందుకు వచ్చి పెద్ద మొత్తం సొంత నిధులు ఖర్చు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రవీందర్, కాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సుధాకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, నాయకులు యాదయ్య, కృష్ణ, నర్సింలు, జగదీశ్, పంచాయతీ కార్యదర్శి వసంత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతిని నిలిపేయండి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్



షాబాద్: మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్: విదేశాల నుంచి దేశంలోకి పత్తి దిగుమతిని కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన బికెఎస్ మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి దిగుమతిపై శుష్కని తగ్గించడంతో వ్యాపారులు విరివిగా విదేశాల నుంచి పత్తి కొనుగోలు చేస్తూ దేశీయ పత్తిని కొనడం లేదన్నారు. దీంతో పత్తి ధరలు రోజు, రోజుకు పడిపోతున్నాయని తెలిపారు. కేంద్రం వెంటనే విదేశీ పత్తి దిగుమతిని నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదన్నారు. ప్రతి రోజు విద్యుత్ సరఫరా క్షీణిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రామస్వామిగౌడ్, యాదయ్య, బాలయ్య, మహేందర్‌రెడ్డి, రవీందర్, శివ, రాంచంద్రయ్య తదితరులున్నారు.

సంక్షేమ బోర్డులో కార్మికుల పేర్లు తప్పనిసరి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



బోర్డు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు

మొయినాబాద్: భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లను కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ కోసం సోమవారం సంక్షేమ బోర్డులో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భవనాలపై పనులు చేస్తారని.. వారి సంక్షేమం కోసమే సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నామన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు తప్పనిసరిగా తమ పేరును సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు కేటాయించే నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చుచేస్తుందన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా యూనియన్ దృష్టికి తీసురావాలని.. ఆ సమస్యలను యూనియన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సద్గుణాచారి, యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేష్, అర్జున్, రమేష్, మల్లేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

పీఆర్టీయూ నాయకుడు కమలాకర్‌రావు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

మొయినాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌తో పాటు పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై ప్రభుత్వంతో చర్చలు జరిపామని.. ఆ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ఇతర సమస్యలపైనా పీఆర్టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు హనుమంతు, రాములు, నరేందర్, రాములు, సంజీవ, నారాయణగౌడ్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీపీఐ నాయకులు



ఎమ్మెల్యే కలిసి సన్మానం చేస్తున్న నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గంలోని భూ సమస్యలను, పేదల ఇళ్ల, స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గం నాయకులు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఐ పార్టీ నియోజకవర్గం నూతన కార్యదర్శిగా ఎన్నికైన కె. రామస్వామితో పాటు నాయకులంతా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, నియోజకవర్గం నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, దళితబంధు పథకాన్ని అర్హులైన పేదలకే ఇవ్వాలన్నారు. అనంతరం నియోజకవర్గం నూతన కార్యదర్శిగా ఎన్నికైన కె. రామస్వామిని అభినందించి శాలువతో సన్మానించారు. అనంతరం సీపీఐ నాయకులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగం, సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

ఆటలతో స్నేహ సంబంధాలు మెరుగు

- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్
- ఫైండ్ల గోపాల్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభించిన ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: క్రీడాపోటీలతో యువత మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని కాంగ్రెస్‌పార్టీ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో సోమవారం పైండ్ల గోపాల్‌రెడ్డి స్మారక క్రికెట్ పోటీలను ఆయన కుమారులు మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను పదును పెట్టి వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో క్రీడాకారుల కోసం ఈపోటీలు నిర్వహించడం వల్ల ఉత్తమ క్రీడాకారులు తమ ప్రతిభను చూపుతారని చెప్పారు. పోటీలలో గెలుపు ఓటమిలు సమానమేనని వాటిని స్ఫూర్తి తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్ పట్టి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎస్ఐ ప్రదీప్, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీసీసీ నాయకులు చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు వసంతం , భీమ్‌భరత్, బందారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

పంచాయతీ డబ్బులు స్వాహా.. మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. పంచాయతీ వ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని గడ్డం ప్రసాద్‌కుమార్ మండిపడ్డారు. పంచాయతీల అభివృద్ధిని అడ్డుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధర్నాకు పిలుపునిస్తే ఎక్కడికక్కడే కాంగ్రెస్ నాయకులను అడుకుని అరెస్టులు చేయడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు.

నియంత పాలనను అంతం చేస్తాం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్: రాష్ట్రంలో కొనసాగుతున్న నియంత పాలనను అంతం చేసేంత వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణం చౌరస్తాలో నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేయలన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు లేకపోవడంతో సర్పంచులు సొంత డబ్బులను ఖర్చు పెడుతున్నారని చెప్పారు. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులను ప్రభుత్వం అరెస్టులు చేయడం సరికాదని అన్నారు. సర్పంచులకు అడ్డంగా ఉండి గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కావలి శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యువకులు

కొత్తూరు: కొత్తూరు మున్సిపల్ కమిషనర్ వీరేందర్ డబ్బులున్నోళ్లకు ఓ న్యాయం.. పేదల పట్ల మరో విధంగా వ్యవహరిస్తున్నాడంటూ స్థానిక నాయకుడు శివాచారి ఆధ్వర్యంలో పలువురు యువత సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శివాచారి మాట్లాడుతూ.. దర్గా రోడ్డులో ఉన్న గణపతి కాలనీలో పాటు కాల్వ ఆక్రమణకు గురైయిందని ..వెంచర్ నిర్వాహకులు అభివృద్ధి పనులు చేపట్టని కారణంగా వర్షాకాలంలో పెద్ద ఎత్తున కాలనీలో వరద నీరు నిల్వ ఉంటుందని తాము మున్సిపల్, ఇతర శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. పాటుకాల్వపై నిర్మించిన కట్టడాలను తొలగించాలని కోరినప్పటికీ కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా, తీగాపూర్ రోడ్డులో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను మాత్రం ఎవరూ ఫిర్యాదు చేయనప్పటికీ తొలగించినట్లు పేర్కొన్నారు. డబ్బులున్నోళ్లకు ఓ న్యాయం .. పేదలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఈ విషయమై కమిషనర్ వీరేందర్‌ను వివరణ కోరగా తీగాపూర్ శివారులో అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపడుతున్న వారికి అనుమతులు తీసుకోవాలని పలుమార్లు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వారు స్పందించని కారణంగా కేవలం ప్రహరీగోడను మాత్రం తొలగించినట్లు పేర్కొన్నారు. గణపతి కాలనీలోని వెంచర్ గత పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిందన్నారు. అప్పుడు కట్టిన నిర్మాణాలను తొలగించే అధికారం తమకు లేదన్నారు. పాటుకాల్వ ఆక్రమణ అంశం తమ పరిధిలోకి రాదనే విషయం చెబుతున్న యువకులు పట్టించుకోవడం లేదన్నారు. చట్టప్రకారమే అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు వివరించారు. చివరగా స్థానిక నాయకుడు దేవేందర్‌యాదవ్ సమక్షంలో కమిషనర్‌కు పలుచోట్ల వెలుస్తున్న అక్రమ కట్టడాల గురించి యువకులు తెలిపారు. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. పాటుకాల్వపై నిర్మించిన కట్టడాలను తొలగించడానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో మరోమారు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో యువకులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, రంజిత్, సాగర్, నగేష్, మహేందర్, సాయిచారి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలి

మండల అధ్యక్షుడు ఎన్. లింగం

షాబాద్: ముదిరాజ్‌లు రాజకీయంగా అన్ని రంగాల్లో ఎదగాలని మండల అధ్యక్షుడు ఎన్.లింగం ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్ ఆవరణలో ముదిరాజ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముదిరాజ్‌లంతా ఏకతాటిపైకి వచ్చి అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ –ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జంగయ్య, వెంకటయ్య, జనార్దన్, చంద్రశేఖర్, బాల్‌రాజ్, వెంకటయ్య, నర్సింహులు, రాంచంద్రయ్య, శ్రీనివాస్, గౌరీశ్వర్ తదితరులున్నారు.



నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు